క్లుప్తంగా

ఎన్ఐసీ సైంటిఫిక్ ఆఫీసర్‌గా బడ్డవానిపేట యువకుడు


సాయికుమార్

నరసన్నపేట: ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ) సైంటిఫిక్ ఆఫీసర్‌గా నరసన్నపేట మండలం బడ్డవానిపేటకు చెందిన జల్లు సాయికుమార్ ఎంపికయ్యాడు. కర్ణాటక రాష్ట్రం కర్వార్ జిల్లాలో పోస్టింగ్ సంపాదించాడు. ఎన్ఐటీ దుర్గాపూర్‌లో బీటెక్, ఢిల్లీలో ఎంటెక్ పూర్తి చేసిన సాయికుమార్ పలు బ్యాంకు ఉద్యోగాలకు సైతం ఎంపికయ్యాడు. తాజాగా గజిటెడ్ ర్యాంక్ ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరులో 15 రోజులపాటు శిక్షణ ఉంటుందని తండ్రి తిరుపతిరావు తెలిపారు.

రూ.1,11,111 విరాళం


నగదు అందజేస్తున్న మల్లికార్జునరావు

హిరమండలం: మండలంలోని దేవరశెట్టి వీధిలో గల సత్యసాయి మందిరం పునర్ నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త మోనింగి మల్లికార్జునరావు రూ.1,11,111 వితరణగా ఆదివారం అందజేశారు. ఈ మొత్తాన్ని సత్యసాయి సేవా సంఘం కార్యదర్శి అంధవరపు వెంకట బుచ్చాబ్బాయికి అందించారు. సత్యసాయి సేవలో తనకు భాగస్వామ్యం కల్పించడం ఎంతో ఆనందనంగా ఉందని మల్లికార్జునరావు అన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్

హిరమండలం: మండలంలో సుభలయలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శ్రీకాకుళంలోని సన్‌రైజ్ హాస్పిటల్ ఎండీ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ నేతృత్వంలో 300 మందికి ఉచితంగా ఈసీజీ, వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. బీపీ, సుగర్, పక్షవాతం, గెండు సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. సాధ్యమైతే ఉదయం సాయంత్రం అర్ధ గంట సమయం నడవాలని సూచించారు. సైన్ రైజ్ వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు జి.వి.రమణ, పొగిరి చిట్టిబాబు, ఈశ్వరరావు, కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఓబీసీ సాధనకు కృషి


మాట్లాడుతున్న రాంబాబు

నరసన్నపేట: శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చడంలో తనవంతు కృషి చేస్తానని నరసన్నపేట శిష్టకరణ సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన సదాశివుని రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక శిష్టకరణ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఓబీసీ సాధిస్తామన్నారు. నరసన్నపేట పట్టణంలోని శిష్టకరణాల్లో పేదలకు గృహాలు, ఇతర ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. శిష్టకరణ సంఘం జిల్లా నాయకులు సదాశివుని కృష్ణ, స్థానిక ప్రతినిధులు ఎం.వి.జె.మోహన్‌రావు, ఆర్.శ్రీధర్(బుజ్జి), కస్పా ప్రసాద్, బూరవెల్లి భాస్కరరావు, ఎ.పి.వి.రమణమూర్తి, డి.రఘు, అంప్లాం వసంతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బింధు తీర్థాన్ని వినియోగంలోకి తేవాలని వినతి

జలుమూరు: శ్రీముఖలింగంలో ఉన్న బింధు తీర్థాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులతోపాటు భక్తులు కోరుతున్నారు. దేశం నలుమూలల నుంచి మధుకేశ్వరుని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు చాలా మంది ఇక్కడ ఉన్న తీర్థఘట్టాలు దర్శించుకుని పుణ్య స్నానాలు చేస్తుంటారు. చాలావరకు తీర్థఘట్టాలు ఆక్రమణలతోపాటు వ్యర్థాలు, చెత్త కుప్పలు, గడ్డితో నిండిపోయాయి. గ్రామం శివారులో ఉన్న బింధు తీర్థ ఘట్టం చుట్టూ గడ్డి పేరుకుపోయింది. అధికారులు స్పందించి బింధు తీర్థాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

జలుమూరు: రబీ వరి పంటకు 60 రోజుల లోపల అన్ని రకాల ఎరువులు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ కుమార్ తెలిపారు. నారు 40 రోజులు దాటింది వేస్తే అన్ని ఎరువులు వేయాలన్నారు. నాట్లు వేసిన నాలుగు, ఐదు రోజుల్లో పీకపురుగు రాకుండా గుళికలు తప్పనిసరిగా వేయాలన్నారు. సాధారణంగా ఖరీఫ్‌లో వరికి వేసిన విధంగా రైతులు ఈ పంటకు వేస్తుంటారని, అలా వేయకూడదన్నారు. తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

రేషన్.. పరేషాన్..!


ఎండీఎం వాహనం ద్వారా రేషన్ సరుకులు అందజేస్తున్న సిబ్బంది


మండల సమావేశంలో రేషన్ సరుకులు అందడం లేదని ఆరోపిస్తున్న బుడితి ఎంపీటీసీ సభ్యుడు మెండ మురళీకృష్ణ (ఫైల్)

- అరకొరగా రేషన్ సరుకుల పంపిణీ
- కార్డుదారుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

సారవకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ సరుకులు అరకొరగా అందిస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో 204 రేషన్ డిపోల్లో 79,003 రేషన్ కార్డుదారులున్నారు. ప్రతినెలా బియ్యం, పంచదార తక్కువగా మంజూరుకావడంతో లబ్ధిదారులందరికీ అందడం లేదు. కార్డుదారుల్లో చాలామంది రేషన్ బియ్యంపై ఆధారపడేవారు ఉన్నారు. రేషన్ సరుకులు సకాలంలో, పూర్తిస్థాయిలో అందకపోవడంతో బయట మార్కెట్లో అధిక ధరలు చెల్లించి రేషన్ బియ్యం కొనుగోలు చేయాల్సి వస్తుంది. సారవకోట మండలంలోని బుడితి గ్రామంలో గతేడాది డిసెంబర్ నుంచి మార్చి వరకు ప్రతి నెలా 40 నుంచి 60 మందికి సరుకులు అందించడం లేదని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి బుడితి ఎంపీటీసీ సభ్యుడు మెండ మురళీకృష్ణ ఈ సమస్యను తీసుకువచ్చారు. ఈ నెల సైతం అదే తంతు కొనసాగుతోంది. మండల కేంద్రంలో 1వ రేషన్ డిపో పరిధిలో ఉన్న కార్డుదారుల్లో సైతం ఈ నెలలో సగానికి పైగా లబ్ధిదారులు సరుకులు అందక గగ్గోలు పెడుతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో ఈ నెలలో అలాంట్‌మెంట్ వివరాలు..

మండలం	రేషన్ డిపోలు	ఎండీఎం వాహనాలు	రేషన్ కార్డులు	బియ్యం అలాంట్‌మెంట్ కేజీల్లో..
జలుమూరు	53	13	18,817	33,389.66
నరసన్నపేట	53	13	23,134	25,578.81
పోలాకి	50	13	20,886	17,055.37
సారవకోట	45	12	16,166	16,885.78

35 కేజీల బియ్యం ఇవ్వలేదు



ఫిబ్రవరిలో నాకు 35 కేజీల బియ్యం ఇవ్వలేదు. బియ్యం ఇస్తారని 20వ తేదీ వరకు వేచి చూశాం. పలుమార్లు బియ్యం బండి దగ్గరకు వెళ్లాను. అయినా ఫలితం లేక వెనుదిరిగి వచ్చేశాను.

– కింతాడ బుజ్జిబాబు, బుడితి జంక్షన్, సారవకోట మండలం

చర్యలు తీసుకుంటున్నాం

కార్డుదారులకు రేషన్ సరుకులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏ రేషన్ డిపో పరిధిలో తక్కువ అలాంట్‌మెంట్ వస్తుందో ఆ డిపోకు అలాట్‌మెంట్ అధికంగా వచ్చిన వారి నుంచి సరుకులు తీసుకువచ్చి అందిస్తున్నాం. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం.

– షరీఫ్, సీఎస్ డీటీ, సారవకోట మండలం

ఎంఎల్ఎస్ పాయింట్‌లో చేతివాటం

సారవకోట మండలం, జలుమూరు మండలాల్లోని రేషన్ డిపోలకు జలుమూరు మండలంలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరుకులు వస్తుంటాయి. అక్కడి నుంచి వచ్చిన 50 కేజీల బియ్యం బస్తాకు 47 నుంచి 48 కేజీలు మాత్రమే ఉంటున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీ బస్తాకు ఇదేవిధంగా వస్తుండటంతో ఆ తరుగుదల ఏం చేయాలో తోచక డీలర్లు ఇబ్బంది పడుతున్నారు.

అలాంట్‌మెంట్‌లో తారతమ్యాలు

ఒక రేషన్ డిపో పరిధిలో ఎంతమంది రేషన్ కార్డుదారులున్నారో అంతమందికి సరుకులు అలాంట్‌మెంట్ చేయాల్సి ఉన్నా తారతమ్యాలు కారణంగా పూర్తిస్థాయిలో సరుకులు మంజూరు కావడం లేదు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం.

రోడ్డుపైనే మురుగునీరు



సారవకోట మండలంలోని సత్రాంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఈ గ్రామంలోని ప్రధాన వీధుల్లో మురుగునీటి కాలువలు కొన్ని దశాబ్దాలుగా లేవు. ఇళ్లల్లో నుంచి వాడుకనీరు, మురుగునీరు రోడ్డు పైకి వచ్చి నిల్వ ఉంటుంది. ఈగలు, దోమలు పెరగడంతోపాటు దుర్వాసనం వస్తుందని స్థానికులు తెలిపారు. మురుగునీటి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. - సారవకోట

రోడ్డు పక్కనే చెత్త కుప్పలు



సారవకోట మండలంలోని బుడితి గ్రామంలో రోడ్డు పక్కనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గతేడాది పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అర్లిలో రోడ్డు శంకుస్థాపనకు వచ్చిన జిల్లా కలెక్టర్ రోడ్డు పక్క చెత్తకుప్పలు ఉండకూడదని ఆదేశించారు. శ్రీముఖలింగం రోడ్డు నుంచి బుడితి గ్రామంలోకి వచ్చే రోడ్డు, బుడితి నుంచి బద్రి వెళ్లే మార్గంలోనూ చెత్తకుప్పలు అధికంగా దర్శనమిస్తున్నాయి. చెత్తకుప్పలకు మంట పెట్టడంతో వచ్చే పొగతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. - సారవకోట

దోమలకు నిలయంగా..



ఈ చిత్రం హిరమండలంలోని చిన్నకోరాడ వీధిలో గల రహదారిపై నిల్వ ఉన్న మురుగునీరు. చిన్నకోరాడ, అంధవరపు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుంచి వాడుక నీరు రహదారులపై నిల్వ ఉంటుంది. దోమలకు నిలయంగా మారింది. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీటి కాలువలను నిర్మించాలని ఆయా వీధుల ప్రజలు కోరుతున్నారు. - హిరమండలం

దిష్టిబొమ్మలా..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని మోదుగువలస కాలనీలో చుక్కనీరు రాని వీధి కుళాయి. లక్ష్మీనర్సుపేటలో ఉన్న మెగా రక్షిత తాగునీటి పథకం ద్వారా గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిల ద్వారా చుక్క నీరు రావడం లేదు. కొమ్మువలస, మోదుగువలస కాలనీ, స్కాట్‌పేట తదితర గ్రామాల్లోని కుళాయిలు వీధుల్లో దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. కుళాయిల ద్వారా వారానికి ఒకరోజు నీటి సరఫరా కావటం కష్టంగా ఉంది. అధికారులు స్పందించి వేసవిలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. - ఎల్.ఎన్.పేట

తూతూ మంత్రంగా మండల సమావేశం

- సభ్యులకు బదులుగా ప్రతినిధులు హాజరు
- పలు శాఖల అధికారులు గైర్హాజరు


సమావేశానికి హాజరైన ఎంపీటీసీ, సర్పంచ్ ప్రతినిధులు

ఎల్.ఎన్.పేట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు బదులుగా వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు మాత్రమే సమావేశానికి హాజరై.. వారి పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం అధికారులతో చర్చించాల్సి ఉంటుంది. ముఖ్యంగా మండల సమావేశానికి ప్రజాప్రతినిధులనే హాజరుపర్చాల్సిన బాధ్యత ఎంపీడీఓపైనే ఉంది. ఆయన పట్టించుకోకపోవటంతో ఈ సమావేశం తూతూ మంత్రంగానే ముగిసిపోయింది. మండల స్థాయి అధికారులు పలువురు గైర్హాజరయ్యారు. పలు శాఖలకు చెందిన దిగువ స్థాయి ఉద్యోగులకు హాజరు కాగా.. మరికొన్ని శాఖలకు చెందిన అధికారులు పూర్తిగా సమావేశానికి రాలేదు. వచ్చిన అధికారులు, ఉద్యోగులు కూడా ప్రజాప్రతినిధుల భర్తలు, కుటుంబ సభ్యులు అడిగిన ప్రశ్నలకు, సమస్యలకు సరైన సమాధానం చెప్పలేని దుస్థితి ఏర్పడింది. బసవరాజుపేట ప్రాథమిక పాఠశాలలో 21 మంది విద్యార్థులు ఉన్నారని, గత ఆరు నెలలుగా డిప్యుటేషన్‌పై రోజుకో టీచరు వస్తున్నారని, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంఈఓను ఎంపీటీసీ శిమ్మ మోహన్‌రావు నిలదీశారు. చింతలబడవంజ పంచాయతీ కార్యదర్శి గ్రామ సభలు నిర్వహించటం లేదని, పంచాయతీ రికార్డులు ఇతర వ్యక్తులకు అప్పగించారని ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని సర్పంచ్ భర్త ఊట సత్యనారాయణ సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైస్ ఎంపీపీ శివ్వాల ఇందమ్మ, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఏఓ పైడి లతశ్రీ, పశువైద్య అధికారి డాక్టర్ కె.కవిత, ఉపాధి హామీ పథకం ఏపీఓ వి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గోతులమయం..


పార్వతీశ్వరునిపేట వద్ద అధ్వానంగా ఉన్న లింక్ రోడ్డు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని పార్వతీశ్వరునిపేట వద్ద లింక్ రోడ్డు అధ్వానంగా తయారైంది. అలికాం-బత్తిలి, పాలకొండ సీఎస్పీ రహదారిని కలిపే లింకు రోడ్డు పూర్తిగా రాళ్లుతేలి గోతులమయమైంది. ఈ రహదారిని మరమ్మతులు చేసేందుకు గతంలో కాంట్రాక్టర్ అప్పగించారు. మెంటినెన్స్ వర్కులు ఆయనే చేయాలని ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకొండ రహదారి వద్ద పలువురు ప్రమాదాలకు గురయ్యారు. అక్కడ మెటీరియల్ వేసి కూడా పనులు నిర్వహించకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

ఈ రహదారిలో సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలు చేస్తున్నారు.నిత్యం పురుషోత్తపురం ఇసుక ర్యాంప్ నుంచి ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన జామి జాతర


కొత్తూరు: నివగాం యాత్రలో భక్తుల సందడి

పాతపట్నం: మండలంలోని కొరసవాడలో గల ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన జాతర ఆదివారంతో ముగిసింది. మూడు రోజుల క్రితం భక్తులు జోగి దండి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రీతికరమైన వంటలను పెట్టి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఎస్ఐ బి.లావణ్య, సర్పంచ్ ఉమ, ఎంపీటీసీ సభ్యురాలు సుగుణ, గ్రామ పెద్దలు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

భక్తుల తాకిడి

కొత్తూరు: మండలంలోని నివంగాంలో గత మూడు రోజుల నుంచి నిర్వహించిన జామి యాత్రకు ఆదివారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. ఎల్లమ్మను దర్శించుకునేందుకు కొత్తూరు, భామిని, సీతంపేట, హిరమండలం మండలాలతోపాటు పక్కన ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన పలు గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల తాకిడి మరింత ఎక్కువగా ఉంది.

సందడే.. సందడి


రవీంద్రభారతిలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక రవీంద్రభారతి, శ్రీజ్ఞానజ్యోతి స్కూళ్లల్లో ఆదివారం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. రవీంద్రభారతి స్కూల్ సీజీఎంజీ ఆర్.వసంతకుమార్, ప్రిన్సిపాల్ ధర్మాన వాసుదేవరావు.. మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా, ఆత్మస్థైర్యంతో ఉండాలని, క్షణికావేశాలకు గురికావద్దని సూచించారు. జ్ఞానజ్యోతి స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణమోహన్, కేశవరావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. స్కూల్ యాజమాన్య ప్రతినిధిలు బోర రామారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు శివలింగం ప్రతిష్టాపన

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు లక్ష్ముడుపేటలోని సత్యసాయి బాబా మందిరంలో సోమవారం ఉదయం శివలింగాన్ని ప్రతిష్టాపన చేయనున్నట్లు ఆలయ అర్చకులు రాజారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. బాబా మందిరాన్ని అలంకరించారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలంతా పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

12 నుంచి వేంకటేశ్వర స్వామి డోలోత్సవాలు

హిరమండలం: మండలంలోని సుభలయ తపోగిరి (మెట్ట)పై గల వేంకటేశ్వరస్వామి డోలోత్సవాలను ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడురోజులపాటు డోలోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మొదటిరోజు మఘను పురస్కరించుకుని రాత్రి 12 గంటలకు కామదహన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. గురువారం పడియ స్వప్నంలో భాగంగా స్వామివారి నిజరూప దర్శనం, కల్యాణం, తిరువీధి కార్యక్రమాలు చేపడతామన్నారు. చివరిరోజు స్వామివారి చక్రతీర్థ స్నానాలు, డోలాయనం, పంచాంగ శ్రవణం, అన్నసంతార్పన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

చెక్ డ్యామ్ పనుల పరిశీలన

కొత్తూరు: మండలంలోని ఎస్ఎస్ కాలనీ సమీపంలో ఉన్న హడ్డుబంగి గెడ్డ వద్ద గతంలో నిర్మించిన భారీ చెక్ డ్యామ్‌ను మరమ్మతులు చేపట్టేందుకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆదివారం పనులు ప్రారంభించారు. ఈ పనులను నీటిపారుదల కొత్తూరు సెక్షన్ జేఈ ప్రసాదరావు పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. గతేడాది అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చెక్ డ్యామ్‌ను ఇసుక బస్తాలతో తాత్కాలిక పనులు చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదించామని జేఈ చెప్పారు. ఆ నివేదిక మేరకు రూ.5 లక్షలు కలెక్టర్ మంజూరు చేశారన్నారు. తాత్కాలిక పనులతో ఆయకట్టు భూములకు సాగునీరు అందదని రైతులు వాపోతున్నారు. ఇసుక బస్తాలతో గతంలో రైతులు సొంతంగా పనులు చేసినప్పటికీ భారీ వరదలకు కొట్టుకుపోయాయన్నారు. కూలిపోయిన చెక్ డ్యామ్ స్థానంలో కొత్తగా చెక్ డ్యామ్ నిర్మించాలని కోరుతున్నారు.

పోటీ పరీక్షల్లో రాణించాలి


విజేతకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అజాద్ వెల్ఫేర్ అసోసియేషన్, మదర్ థెరిసా సేవా సంఘం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టును ఆదివారం నిర్వహించారు. ఈ పోటీ పరీక్షల్లో పాతపట్నం ఎంపీపీ పాఠశాలకు చెందిన పొట్నూరు ప్రేమ్ ప్రథమ స్థానం సాధించారు. ప్రేమ్‌కు ఎమ్మెల్యే చేతుల మీదుగా షీల్డ్, రూ.15 వేలు నగదు బహుమతిని అందజేశారు. తీమర గ్రామంలోని అభయాంజనేయ స్వామి వార్షికోత్సంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయాభివృద్ధికి రూ.10 వేలను కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. సలాన మోహన్‌రావు, ఎంఈవో గోవిందరావు, హెచ్‌ఎంలు వైకుంఠరావు, కృష్ణారావు, పీఈటీ కృష్ణారావు, రవి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాతపట్నం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, వాటి సాకారానికి కృషి చేయాలని రవీంద్ర భారతి పాఠశాల డీన్ వి.నాగరాజు అన్నారు. స్థానిక అచ్చుతాపురంలో గల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. హెచ్‌ఎం బి.ప్రభాకరరావు మాట్లాడుతూ.. పదో తరగతి ప్రతి విద్యార్థికీ కీలక దశ అని అన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒత్తిడి జయిస్తే విజయం సొంతం


వైద్యులను సన్మానిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

పోలాకి: ఒత్తిడి జయిస్తే విజయం సొంతం అవుతుందని ప్రముఖ వైద్యులు పైల రమణ, కిల్లి సతీష్ అన్నారు. ఆదివారం విశ్వశాంతి హైస్కూల్‌లో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథులుగా వీరు (అదే పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు) హాజరయ్యారు. గ్రామీణప్రాంత విద్యార్థుల్లో ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని, విద్యపై దృష్టిసారించాలని సూచించారు. పరీక్షల సమయంలో ముందస్తుగా సిద్ధమై ప్రశాంతంగా ఉండాలన్నారు. విశ్వశాంతి పాఠశాలలో వారి అనుభవాలను వివరించారు. పాఠశాల డైరెక్టర్ మెట్ట జనార్దనరావు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి


భోజనాలను పరిశీలిస్తున్న డీడీ విశ్వేశ్వర రెడ్డి

సారవకోట: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని సోషల్ వెల్ఫేర్ డీడీ వై.విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సమీకృత గృహాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. వసతి గృహంలో 30 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. విద్యార్థులకు ఇటీవల స్టేషనరీ మంజూరైందని, వాటిని అందజేసినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనాల్లో నాణ్యతా ప్రమాణాలు, మెనూ పరిశీలించి తగిన సలహాలు, సూచనలిచ్చారు. ఏఓ సమీర్ కృష్ణ, వార్డెన్ మోహన్‌రావు ఉన్నారు.